# కొలనులో చేప

చిన్న చేపకు చిరాకుగా వుంది. ఎంత జాగ్రత్తగా వున్నా, ఆ పెద్ద చేపలు రెండూ తనని తినటానికి సర్వ ప్రయత్నం చేస్తున్నాయి. తను చాలా తెలివిగా తప్పించుకుంటున్నది. అయినా ఆ రెండు పెద్ద చేపలూ తమ ప్రయత్నాలను మానలేదు.

చిన్న చేప యింకొక బుల్లి చేపను సలహా అడిగింది. ఆ బుల్లి చేప తనూ అదే పరిస్థితిలో వున్నానని చెప్పింది. అంతేకాదు తను ఆ కొలనులోనించి యింకొక మంచి కొలనులోకి పారిపోదామనుకుంటున్నానని కూడా చెప్పింది.

అప్పుడు చిన్న చేప అనుకున్నది - అవును - ఈ కొలను మంచిది కాదు - "మన" అన్న భావం అసలేలేని ఈ పెద్ద చేపలు, అమాయకులయిన చిన్న చేపలను నాశనం చేస్తున్నాయి. తను కూడా యింకొక కొలనుకు పోవటం మంచిది.

అనుకున్నట్టుగా మర్నాడే యింకొక కొలనులో చేరింది. వెళ్ళగానే ఆ కొలను చక్కగా

కనిపించింది. అక్కడి చేపలు మంచి చేపలుగా అనిపించాయి. దుర్మార్గులకు దూరంగా వచ్చినందుకు సంతోషించింది చిన్న చేప.

కానీ ఆ సంతోషం ఎక్కువసేపు నిలువలేదు - ఆ కొలనులో కూడా చాల పెద్ద చేపలు వున్నాయి. వాటిలో మూడు పెద్ద చేపలకు ఆకలి మరీ ఎక్కువలా వుంది. చిన్న చేపలను తినటం మొదలుపెట్టాయి. అంతేకాక మన చిన్న చేప వెంటకూడా పడ్డాయి. చిన్న చేప చాలా తెలివిగా తప్పించుకు తిరిగింది. అలా నాలుగు రోజులు చాలా అప్రమత్తంగా ప్రవర్తించింది. ఆ కొలనులో కూడా తన బ్రతుకు దుర్భరమైపోవటంతో బాధపడింది. అక్కడి నించి బయల్దేరి యింకొక కొలనులోకి చేరింది. ఈ కొత్త కొలను మంచిది అని వినివుండటంవలన, అక్కడ తన జీవితం సుఖమయంగా వుంటుందని ఆశ పడ్డది.

ఆ కొత్త కొలను, చిన్న చేప అనుకున్నట్లుగానే చాలా అందంగా వుంది. అక్కడి చేపలు స్నేహ పూర్వకంగా ఆహ్వానించాయి. చివరకు తను ఒక మంచి కొలనులోకి చేరినందుకు చాల ఆనందించింది చిన్న చేప.

మొదటి రోజు చాలా సరదాగా గడిచింది. రెండవ రోజునే తెలిసింది - అక్కడా పెద్ద చేపలు, చిన్న చేపలను తినటానికి వెనకాడవని. ఆ మాట చెప్పిన యింకొక పిల్ల చేప - "మనందరం కలసి ఈ పెద్ద చేపల అరాచకాలను అరికట్టాలి - రండి! మీరంతా నాతో కలవండి - మనందరం కలిస్తే ఈ పెద్ద చేపల అంతు చూడటం పెద్ద కష్టం కాదు" అన్నది. ఆ పిల్ల చేప మాటలు ఎవరూ పట్టించుకోలేదు.

మన చిన్న చేప అనుకున్నది - "పిచ్చి మాలోకం - తను ఒక్కతీ ఈ అరాచకాన్ని ఎలా అరికట్టగలదు -" అనుకుంటుండగానే, ఒక పెద్ద చేప తన పెద్ద నోరు తెరుచుకుని మీదకు వచ్చింది తినటానికి.

తప్పించుకు తిరగటం తనకు అలవాటే కనుక, చిన్న చేప గబగబా ఈదుకుంటూ పారిపోయింది. అయినా పెద్ద చేప, చిన్న చేపను వదలలేదు - వెంటబడింది.

అలా తిరిగి తిరిగి నీరస పడిపోయింద చిన్న చేప. పెద్ద చేపకు బాగా ఆకలిగా వుంది కాబోలు, చిన్న చేపను మాత్రం వదలలేదు.

అలసి సొలసిపోయిన చిన్న చేపను, చటుక్కున నోటికి కరుచుకుంది పెద్ద చేప. గిలగిలా తన్నుకుంది చిన్న చేప.

పెద్ద చేప, చిన్న చేపను చంపేసి, తినేసితన ఆకలి తీర్చుకుంది.

చనిపోబోతూ అనుకున్నది చిన్నచేప - "ఈ సృష్టిలో చిన్నా, పెద్దా, అనే తేడా వుండకూడదు. అది వున్నంతకాలం, పెద్ద చేపలు చిన్న చేపలను తింటూనే వుంటాయి - " అని.

అంతేకాదు -- "మనల్ని రక్షించటానికి ఎవరో ఎక్కడి నుంచో రారు! మన రక్షణ మనమే కలిపించుకోవాలి - పిల్ల చేప చెప్పినట్టు అందరం కలసి పోట్లాడివుంటే - నాకీ చావు వచ్చేది కాదుకదా" అని కూడా అనుకున్నది. ✿